# మధుర భావన-13

వెంటనే సుమజ....'విన్నవించుకోనా .... చిన్న కోరికా...' అంటూ సరదాగా రాగం తీసింది.

వంశీ కూడా వెంటనే జవాబిచ్చాడు..." నువ్వంత వినయంగా విన్నవించుకోవాల్సిన అవసరం లేదు సుమా....చిన్నదే కాదు, ఎంత పెద్ద కోరికనైనా తీర్చాల్సిందేనని ఆజ్ఞాపనగా అడిగే హక్కు నా దగ్గర నీకు ఉంది...!" అంటూ "అదేదో త్వరగా చెబుదూ.." అనడిగాడు కూడా.

" అంటే....అత్తగారితో 'చెలిమి కలి మి 'కి అనుమతి ఇస్తారా అని...!" అంది గుసగుసగా.

" అంటే..?" అర్థం కాక అతను అడిగాడు.

" అంటే ఏం వుందీ...ఆ డాక్టరుగారింట్లో ఓ గదిలో అత్తయ్య ఒక్కరే ఉంటున్నారు కదా, నేనూ ఉండి అత్తయ్య ఆలనా పాలనా అన్ని అవసరాలూ చూస్తూ కనిపెట్టి ఉండచ్చా అని అడుగుతున్నాను, నా ఆశ ఏమిటంటే...రోజుకి ఒకసారైనా మీరూ అక్కడికి వస్తుంటారుగా, మీతో కూడా రోజు మాట్లాడుతూ కాలక్షేపం చేసే కోరికా తీరుతుందని ! " కొంత సిగ్గుగా ధ్వనించింది ఆమె స్వరం.

అమ్మ పట్ల సుమజ ఆదరణకీ....తన పట్ల ఆమె ఆరాధనకీ ముగ్ధుడైన వంశీ చాలా రోజుల తర్వాత మధురంగా నవ్వాడు.

" నువ్వన్నట్లే నేనూ డాక్టరుగారిని అడిగా...అమ్మతో పాటూ నేనూ అక్కడే ఉండి చూసుకుంటానని. దానికాయన ఏమన్నారో తెలుసా ? 'అమ్మగారు మిమ్మల్ని గుర్తు పట్టకపోవటమేగానీ మిగతా విషయాల్లో బాగానే వున్నారు. కొత్తవాళ్ళతో మామూలుగానే మాట్లాడుతున్నారు. టీ.వీ. చూస్తూ, పాటలు వింటూ, పేపరు తిరగేస్తూ...మేం ఇచ్చిన మందుల్ని కాదనకుండా వేసుకుంటూ బాగానే కాలక్షేపం చేస్తున్నారు. ఆమె మనసుకు తగిలిన గాయం ఇలా కొత్తవాళ్ళతో కబుర్లు చెబుతున్నప్పుడైనా బయటకు వస్తుందేమోననే నేను ఇక్కడ వుంచమన్నాను ! ఇక సాయంకాలాలు మా మనవరాలితో చక్కగా కబుర్లు చెబుతున్నారు...తను చెప్పేవి బాగా వింటున్నారు. తనూజ తను సెల్ ఫోన్ లో చూసినవీ, కామిక్ బుక్స్ లో చదివినవీ, ఏవో జోక్స్ చెబుతూ వుంటుంది...ఆ సమయం లో మా ఇంట్లో వాళ్ళందరూ కూడా అక్కడ మీ అమ్మగారి దగ్గరే చేరతారు...ఈ వేళ నేనూ వున్నాను, మా తనూజ చెప్పిన ఒక జోక్ చెప్పనా?

ఒకమ్మాయి గూగుల్ ని 'మంట లేకుండా వంట చేయగలిగే పద్ధతి ఏమిటని ' సరదాగా అడిగితే...జవాబు ఏమని వచ్చిందో తెలుసా...'ఒక గిన్నె పట్టుకుని నాలుగిళ్ళ ముందర నిలబడి ' అమ్మా' అని కేక పెట్టటమేనట !' అడుక్కోమని చెప్పటమన్నమాట ! మీ అమ్మగారితో సహా అందరం ఎంత సరదాగా నవ్వామో తెలుసా !' అన్నారు. ఇంకొక మాట ...డాక్టరు గారు అంతకుముందు చెప్పిందీ చెబుతా ! అమ్మ అనారోగ్యం ఎన్నాళ్ళు...కాదు, ఎన్నేళ్ళు ఉంటూందో తెలియదనీ అనుకోవటానికీ లేదు...త్వరలోనే తగ్గుతుందని డాక్టరుగారు భరోసాగా చెప్పినందువల్లే, ఆ నమ్మకంతోనే నిరీక్షిస్తున్నా. అలా కాకుండా ఆయన 'ఏమో...ఏదీ తెలియటం లేదు...ఏమీ చెప్పలేం, ఎన్నాళ్ళో' అంటే మాత్రం.... ఏదో విధంగా పెళ్ళి ముగించేసి...ఇద్దరం అమ్మ ని మన ఇంట్లోనే కనిపెట్టుకుని ఉండేవాళ్ళం ! డాక్టరు గారి భరోసాతో పెళ్ళి వాయిదా వేసినా గానీ...ఇవాళ అనూష ప్రశ్న తో నీకూ వివరణ ఇవ్వాల్సిన అవసరం వుందనిపించింది. అర్థమైందిగా ? "

నా సుదీర్ఘ వివరణకు సుమజ " తప్పకుండా నా మనసూ అదే చెబుతుంది....అత్తయ్య మునపటిలా ఆరోగ్యంగా, హాయిగా నవ్వుతూ వున్నప్పుడే మన పెళ్ళి జరగాలన్నది, నా అభిమతం కూడా" అంది నవ్వుతూ.

* * *

'ఎంత హాయీ... ఈ రేయి..' అని మనసు రాగం తీస్తుంటే... ఆనందంగా ఇంట్లోకి అడుగుపెట్టిన వంశీని చూసి తిలోత్తమ ''ఏంటి బావా... అంతలా ఆనందంగా కనిపిస్తున్నావూ...?'' అనడిగింది.

''అవునా...?'' అనడిగాడు వంశీ.

''అవును...'' అంటూ తలవూపిన తిలోత్తమ ''నీకన్నా ముందుగా నేనే వచ్చేసానే...నా గురించి ఇంట్లో ఎదురు చూస్తూ వుంటారన్న కంగారుతో హడావుడిగా వచ్చెసాను... ఇపుడే... వదినకు ఫోన్ చేసి మాట్లాడాను..!'' అంది.

''ఏమనీ...?'' నిరాసక్తంగా అడిగాడు వంశీ.

''సుమజని ఇష్టపడుతున్న మీ అన్నయ్యని ఒప్పించి పెళ్ళి చేసుకోమని నాకు ఎందుకు చెప్పావు అనడిగాను. ఏమందో తెలుసా...? 'మీ ఇద్దరే సరిజోడీ అని నాకనిపించిందీ... నీలాంటి అందగత్తె ప్రేమించానంటే, అన్నయ్య మనసు మారకుండా ఉంటుందా' అంది.''

ఆ మాటలకు వంశీ తిలోత్తమ వైపు ఆసక్తిగా చూసి అడిగాడు ''నువ్వేమని అనుకుంటున్నావ్?''

తిలోత్తమ చిరునవ్వుతో చూసింది. ''నన్ను నేను తగ్గించుకోను కదా, అందుకే మా వదిన మాటలు నిజమేనని నమ్ముతున్నాను! నువ్వేమంటావు బావా...?'' కవ్విస్తున్నట్లుగా నవ్వుమొహంతో చూస్తూ అంది తిలోత్తమ.

వంశీ కూడా చిరునవ్వుతో చూశాడు. ''నీ కలాంటి నమ్మకం ఉంటే మంచిదే! నాకేం అభ్యంతరం లేదు!'' అంటూ వంశీ లోపలకు వెళ్ళిపోయాడు.

ఆ మాటలకు అర్థం ఏమై ఉంటుందా అని తిలోత్తమ ఒక క్షణం ఆలోచించింది.

వంశీ కూడా లోపలకు వెళ్ళి ఒక్కడూ స్థిమితంగా కూర్చున్నాక, అనూష తిలోత్తమ తో అలా ఎందుకు చెప్పి ఉంటుందా అని ఆలోచించాడు. 'తనకి సుమజ విషయం తెలిసీ, తను తిలోత్తమ అందానికి ఆకర్షితుడు అవుతానని అనూష  ఎందుకు అనుకుందీ...?' అతని ఆలోచనకు ఏ కారణం దొరకలేదు.

* * *

మరుసటి రోజు సుమజ, భార్గవీ వాళ్ళ వూరుకు వెళ్ళిపోయారు.

వంశీ హాస్పటల్ కి తల్లిని చూడటానికి బయలుదేరుతుంటే తిలోత్తమ తను రానని చెప్పింది.

ఏదైనా మార్పు కనిపించినపుడు వెళ్ళి చూడటం సరిపోతుంది గానీ రోజూ వెళ్ళటం తనకిష్టం లేదని నిక్కచ్చిగా చెప్పటంతో వంశీ ఒక్కడే బయలుదేరాడు.

డాక్టరుతో తను తల్లితో కాసేపు ఒంటరిగా మాట్లడాలని అనుకుంటున్నట్లు చెప్పగానే, ఆయన లోపలకు వెళ్ళి, శ్యామసుందరి గదిలోకి వేరెవ్వరూ వెళ్ళ వద్దని చెప్పిరావటంతో వంశీ తల్లి ఉంటున్న గదిలోకి వెళ్ళి తలుపు వేసేశాడు.

తల్లి మంచం మీద కూర్చుని ఉంటే, వంశీ వెళ్ళి నేల మీద ఆమె పాదాల  దగ్గర కూర్చుని ''అమ్మా...'' అని ఆర్తిగా పిలిచాడు.

ఆమె ఎప్పటిలానే నిర్లిప్తంగా చూసింది.

వంశీ తన మనసులోని వ్యధనంతా తల్లితో మొరపెట్టకుంటున్నట్లుగా చెప్పటం మొదలుపెట్టాడు.

‘‘అమ్మా... నేను... నీ వంశీని. ఎందుకని... ఎందుకనమ్మా... నన్ను గుర్తుపట్టటం లేదూ...? నీ పిలుపుకోసం... ‘వంశీ కన్నా’... ‘నా తండ్రీ’ అని చిన్నపుడు ఎలా పిలిచేదానివో నీకు గుర్తుందా అమ్మా...?

చిన్నపుడు... నాకెన్నేళ్ళ వయసో సరిగా జ్ఞాపకం లేదుగానీ, నీతో కలిసి ఎవరో బంధువులింటికి ఏదో వూరు వెళ్ళటం మాత్రం బాగా గుర్తుంది! వాళ్ళు... తమ ఇల్లంతా సర్దుకుంటుంటే, నువ్వు సాయంచేస్తూండిపోయావు. ఆ సమయంలో ... నేనూ ఆటలాడుకోవటానికో, మరిదేనికో వీధిలోకి వచ్చి అటువైపుగా అడుగులు వేసా, మళ్ళీ ఇంటికి వద్దామనుకుంటే, ఏదో సరిగా తెలియక అటూ ఇటూ తిరిగా! అపుడే... బాగా మబ్బు పట్టి... హోరున వర్షమూ మొదలైంది! ఏం చేయాలో తెలియక ఎవరో ఇంటి వరండాలో బిక్కమొహంతో కూర్చుండిపోయాను.

కాసేపటికే... ఆ ఇంటి గేటు బయట ఎవరో స్త్రీ కూర్చుని వెక్కి వెక్కి ఏడ్వటం విని బయటకు పరుగెత్తి వచ్చాను.

‘వంశీ కన్నా, నా తండ్రీ..ఎటుపోయావురా... ఇంత ఏమరుపాటు నాకెలా వచ్చిందీ... నువ్వు బయటకు వెళ్ళటం చూడలేకపోయానూ..’ అంటూ పిచ్చి పట్టిన దానిలా ఏడుస్తూంటే... నేను ‘అమ్మా...’ అంటూ నీ భుజంమీద చేయివేశా.

అంతే... నువ్వు వెనక్కి తిరిగి చూసి... ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్లుగా నన్ను ఒడిలోకి లాక్కుని ముద్దులతో ముంచెత్తేసావు!

‘భగవంతుడు నా మొర ఆలకించాడు...చూడు... సరిగ్గా నువ్వున్నచోటుకే నన్ను రప్పించాడు. వర్షంతో ముంచెత్తేసి, నన్ను ఇంకా అటూ ఇటూ పరుగులు పెట్టించకుండా ఇక్కడే... నువ్వున్నచోటే కూర్చోబెట్టాడు!’ అంటూ నన్ను ఆర్తిగా పొదివి పట్టుకుని, ఆ బంధువులింటికి తీసుకెళ్ళావు.

వాళ్ళంతా ఎదురువచ్చి ‘హమ్మయ్య.... పిల్లాడు కనుపించాడుగా, నువ్వు పిచ్చిదానిలా ఏడుస్తూ పరుగులు పెడుతూంటే, కాలు చెయ్యీ ఆడక మాకూ ఏం చేయాలో అర్థం కాలేదు! ఇంతలోనే... ఇంత పెద్ద వర్షమూ వచ్చేసింది...!’’ అంటూ తేలిగ్గా వూపిరి పీల్చుకుంటున్నట్లుగా సంతృప్తిగా చూశారు!

అమ్మా... ఆ చిన్న వయసులోనే ఆ రోజు నాకు అనిపించింది... అమ్మను మించిన పెన్నిధి లేనే లేదని! నన్ను చేతులతో చుట్టేసి దగ్గరకు తీసుకున్నపుడు... ఎంత, ఎం...త భరోసాగా ఆనందంగా అనిపించిందో....!

ఇంకోసారీ అంతే. నాకు పదిహేనేళ్ళ వయసపుడు అనుకుంటా... నాకేదో జ్వరం వచ్చింది.

నువ్వు నా మంచం పక్కనే నన్ను కనిపెట్టుకుని కూర్చున్నావు. ఆరోజు నాకు కొంచెం కులాసాగా ఉన్నట్లుగా అనిపించింది. నువ్వు నా మంచం చుట్టూ తిరుగుతూంటే... ఆ గదిలోకి నాన్న రావటం, నిన్ను కసురుకోవటం నాకు బాగా గుర్తుంది.

'ఏమిటిది... ఎవరో ఆ పక్కింటావిడ చెప్పిందని... నువ్వు మూడు రోజులుగా ఉపవాసం ఉండి, వాడి మంచం చుట్టూ ఇపుడు 30 సార్లు ప్రదక్షిణలు చేస్తావా...? వైద్యం జరుగుతోంది... కోలుకుంటున్నాడు. డాక్టరు చెప్పినట్లు చేయాలి గానీ ఎవరో అచ్చమ్మ, బుచ్చమ్మచెప్పిన మాటలు విని అలా గుడ్డిగా చేయటం బావుందా...? ఇలాంటి మూర్ఖపు పనులు ఇంకెపుడూ చేయకు...!'

నాన్న కోపంగా అన్న ఆ మాటలకు నువ్వేమని సమాధానం చెప్పావో గుర్తుందా అమ్మా...? నేను మాత్రం ఎప్పటికీ ఆ మాటలు మర్చిపోను... పోలేను కూడా!

'నిజమే మీరన్నది! డాక్టరు చెప్పిన వైద్యం ఏమీ మానలేదుగా... కాకపోతే ఎవరో ఏదో చెబితే, మామూలు సమయాల్లో నాకూ అంత నమ్మకం కుదరదు! కానీ... ఇలాంటపుడు మాత్రం... ఏమో, నిజమేనేమొ, చేసి చూస్తే ఏం... అనిపించటం సహజమేగా! ఒక్క మూడురోజులు ఉపవాసం ఉన్నంత మాత్రాన నాకు జరిగే నష్టం ఏముందీ... వాడి ఆరోగ్యం కోసం ఈ మాత్రం చేయలేనా? ఆవిడ చెప్పినది నిజం అవనీ, కాకపోనీ, చేయకపోతే మాత్రం నాకు మనసూరుకోదు... చేస్తేనే నిశ్చింతగా ఉంటుంది! వాడికోసం... నా ప్రాణాలైనా ఇచ్చెయ్యటానికి నేను సిద్ధమే అనిపిస్తుంది!'

అమ్మా... నువ్వలా చెప్పినపుడు... కొంత మగతతో అనారోగ్యంగా ఉన్నప్పటికీ నాకేం అనిపించిందో తెలుసా...? నాకంటె అదృష్టవంతుడు మరొకడు ఈ భూమ్మీద ఉంటాడా... అమ్మ ఉంటే... అష్టయిశ్వర్యాలూ ఉన్నట్లే గదా అనీ అనుకున్నాను!

అంత ప్రేమ, ఆదరం చూపించినదానివి... నన్నెలా మరిచిపోయావమ్మా...? నీ మనసుకు అంతటి గాయం చేసానా నేను..? చెప్పమ్మా... చెప్పు...! అందరితో మామూలుగా బాగానే ఉంటున్నావని డాక్టరు అంటున్నారు..! మరి... నన్ను మాత్రమే ఎందుకమ్మా మరిచిపోయావు...? ఈ బాధను నేను తట్టుకోలేకపోతున్నానమ్మా...! "

మాట్లాడుతున్న వంశీ తన తలపై పడ్డ కన్నీటి చుక్కలకి ఉలిక్కిపడ్డాడు. ఆనందంతో తబ్బిబ్బయ్యాడు ! తల్లి తన వ్యధ విన్నదనీ, స్పందించిందనే భావంతో పులకించిపోయాడు. 'అమ్మా..' అంటూ ఆర్తిగా చూశాడు.